సాక్షి ఒడిశా

సోమవారం । 2 । డిసెంబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 5,68,350

బంగారం : 5 గ్రాముల 150 మిల్లీ గ్రాములు

వెండి : 72 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



విద్యార్థుల ఆందోళన

కొందొమల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఆహారం బాగోలేదని ఆరోపించారు. - 8లో



రక్తదాన శిబిరం

గారబందలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 300 యూనిట్లు సేకరించారు. - 8లో

న్యూస్‌రీల్

అర్హులందరికీ ఇళ్లు మంజూరు



సమావేశంలో పాల్గొన్న ఏబీడీఓ, తదితరులు

జయపురం: గ్రామాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో ఎక్కువ మంది లబ్ధిదారులను చేర్చాలని సమీక్ష సమావేశంలో పంచాయతీ అధికారులకు జయపురం సమితి అదనపు బీడీఓ మనోజ్ కుమార్ నాయక్ సూచించారు. ఆదివారం జయపురం సమితి కార్యాలయ సభాగృహంలో గ్రామీణ ఆవాస్ యోజన, గ్రామ పంచాయతీ వికాశ యోజన కార్యక్రమాలపై సమీక్షించారు. సమితిలో గల 11 పంచాయతీల్లో పీఎం ఆవాస్ యోజనలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. ఇళ్లులేని వారిని ఎంపిక చేసి వారికి ఆవాస్ యోజనలో ఇళ్లు కేటాయించాలని సూచించారు. ఈ విషయంలో ప్రతి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీల అభివృద్ధి పనులపై సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. జీపీఓ భగీరథీనాయిక్, ప్రభుత్వ ఇంజినీర్ రంజితా రాణి పండా, 11 గ్రామ పంచాయతీల పీఈఓలు, ఏడీఓలు, వ్యవసాయ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

25 ఎకరాల్లో గంజాయి సాగు ధ్వంసం



గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ సమితి లికిటిపదరో పంచాయతీ పరిధిలోని సారపల్లి అడవుల్లో సాగవుతున్న గంజాయి వనాలను పోలీసులు శనివారం దాడులు నిర్వహించి ధ్వంసం చేశారు. సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో గంజాయి సాగవుతుందని అందిన సమాచారం మేరకు దాడులను నిర్వహించారు. ఈక్రమంలో 75 వేల గంజాయి మొక్కలను ధ్వంసం చేసి వాటిని తగులబెట్టారు.

చోరీ కేసులో 8 మంది అరెస్టు



బలిమెల నిందితుల నుంచి అరెస్టు చేసిన సామగ్రి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి కోర్కుటపల్లి గ్రామంలో నవంబర్ 20న అమ్మవారి జాతర సందర్భంగా చోరీ జరిగింది. బలిమెలకు చెందినన ఓ వ్యాపారి ఇంటి నుంచి సైకిల్, డబ్బు దొంగిలించారు. దీనిపై బలిమెల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆదివారం బలిమెలలో 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు. గోపి డంగారి, సంతోష్ నాగ్, దనేయి ఖోర, సాహెబ్ ఖీలో, మరో నలుగురు బాల నేరస్తులు అరెస్టయిన వారిలో ఉన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమయస్ఫూర్తి



అగ్ని ప్రమాదంలో కాలిన గడ్డి వాములు

జయపురం: ధాన్యరాశులు అగ్నికి ఆహుతి కాకుండా టీఆర్‌డబ్ల్యూ హాస్టల్ విద్యార్థులు కాపాడారు. ఆదివారం బొయిపరిగుడ సమితి దశమంతపూర్ గ్రామ పంచాయతీ దశమంతపూర్‌లో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆ గ్రామంలో ప్రశాంత పొరజతో పాటు కొంతమంది రైతులు కోసి కుప్పలు వేశారు. ధాన్యం నూర్పులు జరిపి గడ్డిని వేరుగా కుప్పలు పెట్టారు. ఆ గడ్డి కుప్పల నుంచి మంటలు రేగాయి. పొగలు రావడం గమనించిన టీఆర్‌డబ్ల్యూ హాస్టల్ విద్యార్థులు వెంటనే మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. ఊరి వారికి కూడా విషయం చెప్పడంతో వారు బొయిపరిగుడ అగ్ని మాపక సిబ్బందికి తెలియజేశారు. అంతా కలిసి గడ్డి కట్టలను దూరంగా విసిరేసి మంటలు ఎక్కువ కాకుండా జాగ్రత్త పడ్డారు. అనంతరం అగ్నిమాపక శాఖ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. అగ్ని ప్రమాదంలో ప్రశాంత పొరజ 3 ఎకరాల గడ్డి కుప్పలు మాత్రం కాలిపోయాయి. ధాన్యం రాశులకు ఏమీ జరగలేదు. హాస్టల్ విద్యార్థుల సమయస్ఫూర్తే కాపాడిందని గ్రామస్తులు ప్రశంసించారు.

అప్రమత్తతే..

హెచ్‌ఐవీకి ఔషధం



పర్లాకిమిడిలో ఎయిడ్స్‌పై సచేతన ర్యాలీ



నర్సింగ్ విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం




ఎయిడ్స్‌పై మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ వైద్యురాలు సునీత

పర్లాకిమిడి:

వ్యక్తిగతంగా అప్రమత్తంగా ఉంటేనే ఎయిడ్స్ నుంచి రక్షణ లభిస్తుందని సెంచూరియన్ వర్సిటీ అధ్యాపకురాలు ఎస్ఎస్ సంధ్య అన్నారు. స్థానిక సీడీఎంఓ కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ సచేతన దినోత్సవాన్ని జిల్లా ముఖ్యవైద్యాధికారి, పీహెచ్‌ఓ డాక్టర్ మహ్మద్ ముబారక్ ఆలీ ప్రారంభించారు. సమావేశంలో డాక్టర్ రబీ నారాయణ దాస్, డాక్టర్ ఎం.రవిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శక్తి ప్రసాద్ పట్నాయిక్, స్వాస్ స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం మేనేజర్ పి.సునీత, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత సీడీఎంఓ కార్యాలయం నుంచి ప్రపంచ ఎయిడ్స్ సచేతన ర్యాలీని స్వాస్ సంస్థ ఆధ్వర్యంలో ట్రాన్స్ జెండర్స్ నిర్వహించారు. అనంతరం సమావేశంలో సీడీఎంఓ డాక్టర్ ముబారక్ ఆలీ మాట్లాడుతూ, హెచ్‌ఐవీ పాజిటివ్ వచ్చినంత మాత్రాన దిగులు చెందవద్దని, వ్యాధి నిర్మూలనకు తగిన ఔషధాలు మెడికల్‌లో లభ్యమవుతున్నాయని అన్నారు. గజపతి జిల్లాలో 180,618 మందికి హెచ్‌ఐవీ పరీక్షలు జరుపగా ఇప్పటివరకూ 1078 ఎయిడ్స్ పాజిటివ్ రోగులు ఉన్నట్లు తేలిందన్నారు.

దేవ దీపావళి..

ప్రత్యేక అలంకరణ



పూరీ పుణ్యక్షేత్రంలో..



పర్లాకిమిడి జగన్నాథ మందిరంలో దేవతా మూర్తులకు ప్రత్యేక అలంకరణ



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పర్లాకిమిడి: దేవదీపావళి సందర్భంగా స్థానిక శ్రీజగన్నాథ మందిరంలో బలభద్ర, సుభద్ర, జగన్నాథ స్వాములను ప్రత్యేక అలంకరణతో పూజ చేశారు. మహిళలు దేవ దీపావళి సందర్భంగా దీపాలు వెలిగించారు. పూరీ పుణ్యక్షేత్రంలో మార్గశిరమాసంలో వచ్చే దేవదీపావళిని మూడు రోజుల పాటు దేవతామూర్తులకు నిర్వహిస్తారు. పర్లాకిమిడిలో శ్రీజగన్నాథ మందిరంలో దేవదీపావళి సందర్భంగా ప్రత్యేక సంగీత, నృత్య కార్యక్రమం వర్షం కారణంగా రద్దు చేశారు.

ముగిసిన జాతీయ పోలీసు సదస్సు

భువనేశ్వర్: దేశ భద్రతకు కీలకమైన 59వ జాతీయ డీజీ-ఐజీపీ సదస్సు శుక్రవారం లోక్ సేవా భవన్‌లో ప్రారంభమై ఆదివారం ముగిసింది. దేశంలోని ప్రధాన భద్రతా సంస్థల అధిపతులు సహా ప్రముఖులు హాజరయ్యారు. ఈ సదస్సులో దేశ భద్రతపై కీలక చర్చలు జరిగాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సుకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సహా అన్ని రాష్ట్రాల డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ పోలీస్ సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. సైబర్ నేరాల సవాల్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం వ్యూహాన్ని సిద్ధం చేస్తోందన్నారు. ప్రస్తుతం ఉన్న భద్రతా ఏజెన్సీలను సాంకేతిక స్థాయిలో బలోపేతం చేయడం అవసరం, తద్వారా వారు ఎలాంటి భద్రతా సవాలునైనా ఎదుర్కోవచ్చు. సదస్సులో హోంమంత్రి తన ప్రసంగంలో భద్రతా వ్యవస్థను పటిష్టం చేసేందుకు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పోలీసు అధికారులతో తన అనుభవాన్ని పంచుకుంటూ.. దేశ భద్రత, పోలీసు వ్యవస్థ మరింత ప్రభావవంతంగా ఉండేలా అన్ని రాష్ట్రాల్లో ఉమ్మడి కృషి జరగాలని అన్నారు.

మూడు రోజుల జాతీయ సదస్సులో వామపక్ష తీవ్రవాదం, తీరప్రాంత భద్రత, మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్ మరియు ఆర్థిక భద్రతతో సహా ప్రస్తుత, అభివృద్ధి చెందుతున్న జాతీయ భద్రతా సవాళ్లను పరిష్కరించడానికి దేశంలోని అత్యున్నత పోలీసు నాయకత్వం రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసింది. ఇది మూడు కొత్త క్రిమినల్ చట్టాల అమలు, పోలీసింగ్‌కు సంబంధించిన ఉత్తమ పద్ధతులపై పురోగతిని కూడా సమీక్షించింది. జమ్ము కశ్మీర్, ఈశాన్య, వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో శాంతిభద్రతలు మెరుగుపడటంపై కేంద్ర హోం మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

జాతీయ డీజీపీ సదస్సుకు రాజధానిలో కమిషనరేట్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నగరంలోని ప్రధాన వీధుల్లో బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ జవాన్లు, ఇతర భద్రతా సిబ్బంది మోహరించారు. మోదీ పర్యటన కారణంగా నగరంలో పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. విమానాశ్రయం నుంచి లోక్ సేవా భవన్ దారి పొడవునా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని చూసేందుకు బారులు తీరారు. మూడు రోజుల ఒడిశా పర్యటన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా ఈ మధ్యాహ్నం న్యూఢిల్లీకి తిరుగు ప్రయాణమయ్యారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



పోటీల్లో పాల్గొన్నారు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న జేడి విజువల్స్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక రామలింగేశ్వర మందిరం ప్రాంగణంలో విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలను ఆదివారం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు త్వరలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు జేడి ఆచారి తెలిపారు.

రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ



ప్రథమ బహుమతిని అందుకుంటున్న సౌమ్య రశ్మీ పట్నాయక్

జయపరం: రాష్ట్ర స్థాయి విజ్ఞాన ప్రదర్శన పోటీలలో జయపురం మోడరన్ ఇంగ్లిష్ పాఠశాల విద్యార్థిని సౌమ్య రశ్మీ పట్నాయక్ ప్రథమ స్థానంలో నిలిచింది. భువనేశ్వర్ కిట్ విశ్వ విద్యాలయం ప్రాంగణంలో ఈ నెల 25వ తేదీన కేంద్ర ఎస్.ఆర్.టీ.ఆర్ సహకారంతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి విజ్ఞాన పోటీలలో 8వ తరగతి విద్యార్థిని సౌమ్య రశ్మీ పట్నాయక్ పాల్గొంది. ఈ పోటీలలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 25 పాఠశాలలకు చెందిన 130 మంది విద్యార్థులు 90 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వాటిలో ఉత్తమ ప్రాజెక్టులుగా 10 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. వాటిలో ఉత్తమ ప్రాజెక్టుగా జయపురం మోడరన్ ఇంగ్లిష్ పాఠశాల విద్యార్థిని సౌమ్యరశ్మీ పట్నాయక్ ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఆ పాఠశాల ఉపాధ్యాయురాలు పవిత్ర మల్లిక్ ఉత్తమ ప్రాజెక్టు ఇన్‌స్ట్రక్టర్‌గా ఎంపికయ్యారు. మోడరన్ ఇంగ్లిష్ పాఠశాల విద్యార్థులు మహావీర్ ప్రధాన్, మహమ్మద్ ఆర్షన్, స్వాగత రంజన్ నాహక్, ఆనందిత మహంతి కూడా తమ ప్రాజెక్టుల ప్రదర్శించినట్లు ఉపాధ్యాయులు వెల్లడించారు.

వంటగ్యాస్ వినియోగంపై అవగాహన



వేదికపై న్యాయ నిర్ణేతలు, నిర్వాహకులు



ముఖ్యఅతిథి నుంచి బహుమతులు అందుకున్న విజేతలు

జయపురం: జయపురంలో మూడు ఆయిల్ కంపెనీల ద్వారా వంట గ్యాస్ వినియోగం, రక్షణ, భద్రత చర్యలపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఆదివారం లేక్ ప్లాసిడ్ కల్యాణ మండపంలో 'అమొ రొసాయి-అమొ దాయిత్వొ'(మన వంట మన బాధ్యత')అన్న నినాదంతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వంటల పోటీలు కూడా నిర్వహించారు. ఈ పోటీల్లో 21 మంది పాల్గొన్నారు. ఈ పోటీల్లో పుష్పాంజలి రథ్‌కు ప్రథమ బహుమతి, భావ చంద్రికా దేవి ద్వితీయ, రశ్మీ పట్నాయిక్ తృతీయ, బభి పట్నాయిక్ చతుర్థ బహుమతులు పొందారు.

ముగిసిన ప్రజ్ఞా భారతి పోటీలు



రామాయణ, మహాభారతాలపై చర్చలో యువకుడు



భగవద్గీత పోటీలో బాలిక

జయపురం: ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, క్రీడల పరిరక్షణ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్న తరుణ ప్రజ్ఞా భారతి సంస్థ గత నాలుగు వారాలుగా నిర్వహిస్తున్న పోటీలు ఆదివారంతో ముగిశాయి. స్థానిక ఎంకేటీ రోడ్డు నారాయిణి ఆంగ్ల కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఉదయం గీతా శ్లోకాల పఠనం, మహాభారతం, రామాయణాలపై చర్చ, సంస్కృతంలో జ్ఞానం పరీక్షలను విద్యార్థులకు నిర్వహించారు. పోటీలలో పట్టణంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తరుణ ప్రజ్ఞా భారతి అధ్యక్షులు తపన కిరన్ త్రిపాఠీ, ఉపాధ్యక్షులు రామ శంకర షాడంగి, కోశాధికారి రవీంద్రకుమార్ మహరాణ, లిపిక దొలాయిలు పోటీలను నిర్వహించగా.. క్షీరేంద్ర దాస్, అజయ మల్లిక్, సబిత త్రిపాఠీలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ నెలలో జరగనున్న తరుణ ప్రజ్ఞా భారతి వార్షిక ఉత్సవాలలో విజేతలకు బహుమతులు అందజేసి సన్మానిస్తామని సంస్థ అధ్యక్షులు తపన కిరన్ త్రిపాఠీ విలేకరులకు తెలిపారు.

రిజర్వాయర్‌లో పడవ బోల్తా

- దంపతులు మృతి



క్రిష్ణ, ప్రతిమ దంపతుల మృతదేహాలు



రిజర్వాయర్‌లో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొరాపుట్: నాటు పడవ రిజర్వాయర్‌లో బోల్తా పడిన ఘటనలో దంపతులు మృతి చెందారు. ఈ విషాదకర ఘటనలో కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి జబాబెడా గ్రామానికి చెందిన క్రిష్ణ పడికి (36), ప్రతిమా పడికి (30) ప్రాణాలు కోల్పోయారు. వీరిద్దరూ వ్యవసాయ పనుల నిమిత్తం జోలాపుట్ రిజర్వాయర్‌లోని కటఫ్ ఏరియాకి ఆదివారం వెళ్లారు. తిరిగి నాటు పడవపై వస్తుండగా తీవ్రమైన గాలులతో పడవ బోల్తా పడడంతో ప్రమాదం చోటుచేసుకుంది. వీరిద్దరూ సకాలంలో ఇంటికి రాకపోవడంతో గ్రామస్తులు అనుమానంతో రిజర్వాయర్ ప్రాంతంలో గాలించడంతోపాటు అధికారులకు సమాచారం ఇచ్చారు. జిల్లా కేంద్రం నుంచి ఒడ్రాఫ్, నందపూర్ సమితి కేంద్రం నుంచి అగ్ని మాపక బృందాలు వచ్చి రిజర్వాయర్‌లో గాలించగా ఇద్దరూ శవాలై కనిపించారు. ఈ ప్రాంతంలో చాలా మంది వ్యవసాయ పనుల కోసం కటాఫ్ ఏరియాకి వెళ్లాల్సి వస్తే నాటు పడవలను ఆశ్రయిస్తుంటారు. ఈ క్రమంలో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు.

• బీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మారథాన్ రన్



పరుగు పందెం ప్రారంభిస్తున్న కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్, పక్కనే బీఎస్ఎఫ్ డీఐజీ సత్యవాన్ కహంచి తదితరులు



మారథాన్ రన్ చేస్తున్న యువతీ యువకులు

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ఆధ్వర్యంలో మారథాన్ నిర్వహించారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలో బీఎస్ఎస్ 60వ రైజింగ్ డే సందర్భంగా ఆదివారం రైల్వే గ్రౌండ్‌లో సామాన్యులకు ఈ పోటీలు నిర్వహించారు. కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్ జెండా ఊపి పోటీలు ప్రారంభించారు. పాల్గొన్న వారందరికీ టీషర్టులు అందజేశారు. రెండు విభాగాల్లో మొదటి నలుగురు విజేతలకు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కొరాపుట్ సెక్టర్ బీఎస్ఎఫ్ డీఐజీ సత్యవాన్ కహంచి, కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలెటెందు రంజన్ శెఠి పాల్గొన్నారు. – కొరాపుట్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఎచ్చెర్ల: లావేరు మండలం బొంతుపేట జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఇతని వయసు సుమారు 70 ఏళ్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడని లావేరు పోలీసులు తెలిపారు. వివరాలు తెలిస్తే 6309990851 నంబరును సంప్రదించాలని కోరారు.

ఫిబ్రవరిలో మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని టౌన్‌హాల్ వేదికగా 2025 ఫిబ్రవరి 9వ తేదీన 30వ మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు స్టార్ బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బలగ ప్రసాద్, వడ్డాది విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పోస్టర్‌ను విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 500 మంది బాడీబిల్డర్లు హాజరయ్యేలా ఎంట్రీలు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. విజేతలకు రూ.లక్షకుపైగా నగదు బహుమతులు, పతకాలు, టైటిళ్లు, ప్రసంశాపత్రాలను అందజేయనున్నట్టు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9949246693 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నాట్య కళాకారిణి నేహకు అవార్డు



అవార్డు అందుకుంటున్న నేహ

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన నాట్య కళాకారిణి డి.నేహ ప్రతిష్టాత్మక డాక్టర్ సి.పి.రావు మెమోరియల్ అవార్డు అందుకున్నారు. శనివారం హైదరాబాద్ శిల్పకళావేదికలో అమృత కల్చరల్ ట్రస్టు సమర్పణలో జరిగిన నాట్య తోరణం కార్యక్రమంలో ఐసీహెచ్ క్రియేటివ్ సొల్యూషన్స్ కో-ఫౌండర్ అనురాధ చంద్రశేఖర్, బీటెల్ రిమ్ సీఈఓ భార్గవి పగడాల, ఆనంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు సీతా ఆనంద్, సామాజికవేత్త రేవతి భుపాల చేతుల మీదుగా అవార్డు, ధ్రువపత్రం, రూ.25వేలు నగదు పారితోషికం అందుకున్నారు. డాక్టర్ శ్రీకాంత్ రఘుపాత్రుని శిష్యురాలైన నేహ కూచిపూడిలో చేసిన సృజనాత్మక నాట్య ప్రదర్శనకు గాను ఈ అవార్డును ప్రదానం చేశారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



రణస్థలం రామతీర్థాలు కూడలిలో కారును ఢీకొన్న లారీ

రణస్థలం: శ్రీకాకుళం నగరవాసులకు రణస్థలం రామతీర్థాలు కూడలిలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. నగరానికి చెందిన అరుణ్‌కుమార్ దంపతులు కారులో విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వస్తున్నారు. రణస్థలం జాతీయ రహదారిపై రామతీర్థాలు కూడలి వైపు వచ్చేసరికి వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో కారు ఒక్కసారి రామతీర్థాలు వైపు నుంచి వచ్చినట్లు తిరిగిపోయింది. లారీ డ్రైవర్ సడన్ బ్రేకు వేయడంతో కారును ఢీకొని ఆగిపోయింది. కారులో ఉన్న అరుణ్‌కుమార్ దంపతులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. శనివారం పోలిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబీకులకు తాము బంధువులమని అరుణ్‌కుమార్ దంపతులు చెప్పారు. నిత్యం రద్దీగా ఉండే రామతీర్థాలు కూడలిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కనీసం ఒక పోలీసైనా అందుబాటులో లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుసాని బ్లాక్‌లో రక్తదాన శిబిరం



గారబంద పీహెచ్‌సీ రక్తదాన శిబిరంపై ర్యాలీ

పర్లాకిమిడి: ప్రపంచ ఎయిడ్స్ నిరోధక దినోత్సవం సందర్భంగా గుసాని సమితి గారబంద గ్రామంలో సచేతన ర్యాలీ గురండి సామాజిక స్వస్థ్య కేంద్రం ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం గారబంద పీహెచ్‌సీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరంలో దాతల నుంచి 300 యూనిట్ల రక్తాన్ని సేకరించి పర్లాకిమిడి బ్లడ్‌బ్యాంకు తరలించారు. కార్యక్రమంలో గారబంద మెడికల్ అధికారి డాక్టర్ పతిత పావన్ బారిక్, డాక్టర్ మహాదేవ్ మరిఖి, ఆయుష్ డాక్టర్ పూర్ణచంద్ర మహాపాత్రో, బ్లడ్ బ్యాంకు ల్యాబ్ టెక్నిషియన్ ఖగేశ్వర బెహరా, గురండి మెడికల్ సంప్రసారణ అధికారి మమతా పాఢి, ఫార్మసిస్టు (గారబంద) కిశోర్ చంద్ర పాణిగ్రాహి, ఎం.పి.హెచ్.యస్.మాలతీ రౌతో, ఏ.యన్.యం. అంజలీ బాలస్వయిని తదితరులు పాల్గొన్నారు



గారబందలో రక్తదాన శిబిరం



గారబందలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంపై సభ



గారబంద పీహెచ్‌సీలో రక్తదాన శిబిరంలో డాక్టర్లు

విద్యాశాఖలో వింతపోకడలు



మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న

శ్రీకాకుళం: ఇటీవల విద్యాశాఖ అధికారులు అవలంబిస్తున్న వింత పోకడలు ఆపాలని డీటీఎఫ్ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పూజారి హరి ప్రసన్న అన్నారు. ఆదివారం శ్రీకాకుళంలో డీటీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతికి సంబంధించి ఇంత వరకు ఆంగ్ల మాధ్యంలో బోధింప చేసిన విద్యాశాఖాధికారులు ఇప్పుడు ఏ మాధ్యమంలోనైనా పరీక్షలు రాయచ్చనని ఆదేశాలు ఇవ్వడం, ఫార్మేటివ్ అస్సైన్‌మెంట్ పరీక్షలను సెల్ఫ్ అసైన్‌మెంట్ పరీక్షలుగా పేరుమార్చి ప్రాజెక్టు, అసైన్‌మెంట్, రాతపనికి మూడు పదులు చొప్పున ముప్పై మార్కులు కేటాయించారని తెలిపారు. రాత పరీక్షలు 20 మార్కులకు నిర్వహించి మొత్తం 50 మార్కులకు స్కూల్ రికార్డులు, ఆన్‌లైన్‌లోను మార్కులు వేయించిన విద్యాశాఖ అధికారులు, ఇప్పుడు డిసెంబర్ 7న శనివారం జరుగనున్న మెగా పేరెంట్స్ సమావేశంలో ఇచ్చే విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులలో వాటిని మూడు ఐదు మార్కుల చొప్పున పదిహేను మార్కులకు, రాత పరీక్షల మార్కులను ముప్పైఐదు మార్కులకు కుదించి ప్రోగ్రెస్ కార్డులలో వేయించడం వింతపోకడలకు నిదర్శనమన్నారు. ఇలాంటి అనాలోచిత నిర్ణయాలతో ఉపాధ్యాయులపై పనిభారం పెరుగుతుందన్నారు. అపార్ కార్డులు, రెసిడెన్సియల్ ట్రెనింగ్‌లో సైతం అసంబద్ధ విధానాలు అవలంబించారని దుయ్యబట్టారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కృష్ణారావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.ధర్మారావు, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అప్పలరాజు, మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రఘురామస్వామి, కార్యవర్గ సభ్యులు ప్రసాద్, రమణమూర్తి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



నరసన్నపేట: మండలంలోని బొరిగివలస సుబ్బారావు కాలనీలో నివాసముంటున్న గంగరాపు వేణుగోపాలం (35) మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొరిగివలసకు చెందిన ధనలక్ష్మితో శ్రీకాళహస్తికి చెందిన గంగరాపు వేణుగోపాలంతో వివాహమైంది. ఇద్దరికీ ఇది రెండో వివాహం. శ్రీకాళహస్తిలో కొన్నాళ్లు కాపురం చేశారు. ఇటీవల ధనలక్ష్మి అక్కడ ఘర్షణ పడి కన్నవారింటికి వచ్చేసింది. కొద్ది రోజుల తరువాత వేణుగోపాలం కూడా ధనలక్ష్మి వద్దకు వచ్చేశాడు. ఏం జరిగిందో గానీ ఆదివారం ధనలక్ష్మి ఇంట్లో లేని సమయంలో వేణుగోపాలం ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ధనలక్ష్మి ఇంటికి వచ్చే సరికి వేణుగోపాలం వేలాడుతుండటంతో ఇరుగు పొరుగు వారికి పిలిచింది. వారు వచ్చి చూససరికే మృతి చెందడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ, సిబ్బంది పరిశీలించారు. మనస్తాపంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

రణస్థలం: మండలంలోని చిన్న పిషిణి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 15 మందిని జె.ఆర్.పురం పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. వీరి నుంచి రూ.33,480 నగదు, 15 సెల్‌ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లోని పేకాట, కోడిపందేలు, బెట్టింగ్‌లు, గంజాయి వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

అలరించిన సుధారాణి గాత్ర కచేరి



కీర్తనలను ఆలపిస్తున్న సుధారాణి

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లిలోని అనివెట్టి మండపంలో ఆదివారం నిర్వహించిన కృష్ణవేణి సంగీత నీరాజనం అలరించింది. కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ నిర్వహణలో ఏర్పాటు చేసిన ఈ గాత్ర కచేరిని ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. ప్రఖ్యాత కళాకారిణి మండ సుధారాణి కర్ణాటక శాస్త్రీయ గాత్ర కచేరితో ఆకట్టుకున్నారు. ముత్తుస్వామి దీక్షితులు, త్యాగరాజు కీర్తనలను చక్కగా ఆలపించారు. వయొలిన్‌పై మావుడూరు సత్యనారాయణ శర్మ, మృదంగంపై ఎం.శ్రీధర్, ఘటంపై మావుడూరు సూర్యప్రసాద రావులు వాద్యసహకారాన్ని అందించారు. కార్యక్రమంలో న్యూఢిల్లీకి చెందిన సంగీత నాటక అకాడమీ ప్రతినిధి సంతోష్‌ప్రసాద్ ఈఓ వై.భద్రాజి, టూరిజం అధికారి నారాయణరావు, డీపీఐఆర్‌వో చెన్నకేశవరావు, ఇప్పిలి శంకరశర్మ, పులఖండం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

కాశీబుగ్గ: పలాస రోలర్ స్కేటింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు పీరుకట్ల విశాల్, క్లబ్ కోచ్ బి.చంద్రవతి తదితరులు పాల్గొన్నారు.

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత
- నెలరోజులుగా నిలిచిన సరఫరా
- రాష్ట్ర స్థాయికి నివేదిస్తున్న ఫలితం శూన్యం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు



మందు ఫుల్.. మందులు నిల్!

శ్రీకాకుళం : కూటమి ప్రభుత్వం వచ్చాక నూతన పాలసీలో భాగంగా జిల్లాలో ఎక్కడ చూసినా మద్యం షాపులే దర్శనమిస్తున్నాయి. మందు నిల్వలతో లిక్కర్ దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. మందుకు ఇచ్చినంత ప్రాధాన్యం ప్రభుత్వం పేదలకు ఇవ్వాల్సిన మందులకు ఇవ్వడం లేదు. ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత ఏర్పడి రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న రిమ్స్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులు, వైద్యశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న సీహెచ్‌సీ, పీహెచ్‌సీలను మందుల కొరత వెంటాడుతోంది. పాంటాప్, పారాసెటమాల్, డైక్లోఫినాక్సోడియం వంటి సాధారణ మందులు కూడా అందుబాటులో లేకపోవటంతో రోగులు బయటే కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆస్పత్రులకు వచ్చే 80 శాతం మంది రోగులకు ఈ మందులే అవసరమవుతాయి. కారణం తెలియకపోయినా గత నెల రోజులుగా రాష్ట్ర సెంట్రల్ డ్రగ్ విభాగం నుంచి జిల్లా సెంట్రల్ డ్రగ్ విభాగానికి సరఫరా నిలిచిపోయింది.

గతమెంతో ఘనం..

గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ఉన్న రోగులకు ప్రభుత్వ వైద్యశాలలే ఆధారం. గత ప్రభుత్వం వైద్యరంగాన్ని ఎంతో బలోపేతం చేసింది. మందుల సరఫరాతో పాటు అత్యంత ఆధునిక పరికరాలు, పనిముట్లు, యంత్రాలు ఆస్పత్రులకు సరఫరా చేసింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వైద్య రంగం పట్ల నిర్లక్ష్యం చూపిస్తోంది. జిల్లా అధికారులు, హెచ్‌ఓడీలతో జరిగే సమావేశంలో వైద్యులు మందుల కొరత విషయాన్ని చెబుతున్నా ఫలితం లేకుండా పోతోందని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి అధికారులకు వైద్యాధికారులు జిల్లా అధికారుల ద్వారా నివేదించినప్పటికీ మందులు సరఫరా జరగటం లేదని, స్థానికంగా కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నారని వైద్య వర్గాలు అంటున్నాయి. అయితే ఆ స్థాయిలో నిధులు లేకపోవటంతో కొంత వరకే కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు సంఖ్యకు తగ్గట్టుగా సరిపోవటం లేదని తెలియజేస్తున్నారు. రోగికి 50 మాత్రలు అవసరం అనుకుంటే 20 మాత్రలే ఇవ్వగలుగుతున్నారు. పేద రోగులకు అవసరమయ్యే మందులు తక్షణం సరఫరా చేయాల్సిన అవసరం ప్రభుత్వంపైన ఉంది. తరచు సమీక్షలతో సరిపెడుతున్న ప్రజా ప్రతినిధులు మందులు సరఫరా అయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నివేదించాం..

సెంట్రల్ డ్రగ్ విభాగంలో అందుబాటులో ఉన్న మందులను వైద్య, ఆరోగ్య శాఖ, ఏపీవీవీపీ ఆస్పత్రులకు సకాలంలో సరఫరా చేస్తున్నాం. మా వద్ద నిల్వలు లేకపోతే రాతపూర్వకంగా తెలియజేసి స్థానికంగా కొనుగోలు చేసుకోవాలని ఆయా ఆస్పత్రుల డాక్టర్లకు సూచిస్తున్నాం. కొన్ని మందుల అవసరం విషయం రాష్ట్ర స్థాయికి తెలియజేశాం. రెండు, మూడు రోజుల్లో సరఫరా జరుగుతుందని పైఅధికారుల నుంచి సమాచారం వచ్చింది.

– సత్య ప్రభాకర్, ఈఈ, ఏపీహెచ్ఎంహెచ్ ఐడీసీ, శ్రీకాకుళం

• విద్యార్థుల ఆందోళన



మెయిన్ గేటు బయట ఆందోళన చేసిన విద్యార్థులు

రాయగడ: సదరు సమితి కొందొమల్లి గ్రామంలో గల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు శనివారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. తమకు ఇస్తున్న ఆహారంలో పూర్తిగా నాణ్యత లోపిస్తోందని గేటు బయట బైఠాయించారు. సమాచారం తెలుసుకున్న సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, జిల్లా సంక్షేమ శాఖ అసిస్టెంట్ అధికారి ప్రకాష్ చంద్ర నాయక్, సి.ఆర్.సి.సి, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం పులమతి మహాలి, తదితరులు విద్యార్థులను బుజ్జగించే ప్రయత్నం చేశారు. ఆశ్రమ పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉంటున్నారు. ప్రతీరోజు వారికి ఇస్తున్న ఆహారం నాసిరకంగా ఉంటుందని ఇదివరకే ఫిర్యాదు చేశారు. ఆ గ్రామవాసులు కూడా సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు స్పందించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చేపట్టాల్సిన పరిస్థితి వచ్చిందని గ్రామస్తులు తెలిపారు. సుమారు గంటన్నర సమయం వరకు విద్యార్థులు గేటు బయటే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇకపై ఈ సమస్య ఉండదని నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకుంటామని, జిల్లా యంత్రాంగం దృష్టికి సమస్యను తీసుకువెళ్తానని సమితి అధ్యక్షురాలు టున్ని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

• ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఇచ్ఛాపురం మండలం హరిపురం గ్రామానికి చెందిన అసిరమ్మతల్లి కోలాట బృందం ప్రదర్శన అలరించింది. జానపద కళాకారుడు తిప్పన ధనుంజయం ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో అమ్మవారి తిరువీధుల్లో బృందం సభ్యులు కోలాటంతో భక్తుల్ని మంత్రముగ్ధుల్ని చేశారు. అనంతరం టీటీడీ సంస్థ కళాకారులను సత్కరించింది. కార్యక్రమంలో కోలాటం ఆర్గనైజర్లు లోపింటి శంకర్, జి.పరశురాం, చిల్ల ధర్మారాజు పాల్గొన్నారు.
–ఇచ్ఛాపురం రూరల్

టీడీపీ నేతల కుట్రలకు హైకోర్టు బ్రేక్



ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న హుదూద్ ఇళ్ల లబ్ధిదారులు

టెక్కలి: సంతబొమ్మాళి మండలం మేఘవరం గ్రామంలో హుదూద్ ఇళ్లల్లో నివసిస్తున్న లబ్ధిదారుల పట్టాలను రద్దు చేసి వాటిని అమ్ముకోవాలని ప్రయత్నాలు చేసిన మంత్రి అచ్చెన్నాయుడు, టీడీపీ నాయకుల కుట్రలకు హైకోర్టు బ్రేక్ ఇచ్చిందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయా లబ్ధిదారులంతా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దువ్వాడ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎంతో పారదర్శకంగా లబ్ధిదారులకు హుదూద్ ఇళ్లు కేటాయించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లబ్ధిదారులను బయటకు గెంటేసి ఆయా ఇళ్లను అమ్ముకోవాలని ప్రయత్నాలు చేశారని చెప్పారు. ఈ సమస్యను పంచాయతీకి చెందిన నాయకుడు పరపటి శ్రీనివాస్ రెడ్డి తన దృష్టికి తీసుకురావడంతో ఇటీవల కలెక్టర్‌ను కలిసినట్లు వెల్లడించారు. అనంతరం హైకోర్టును ఆశ్రయిస్తే లబ్ధిదారులకు అనుకూలంగా ఆర్డర్ ఇచ్చిందని ఎమ్మెల్సీ తెలిపారు. ఇకపై లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు పరపటి శ్రీనివాస్‌రెడ్డి, మేరుగు అప్పారావు, నారాయణరావు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ మోడల్ టెస్ట్‌కు స్పందన



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్ష నిర్వహించారు. సంతబొమ్మాళిలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు వజ్రపుకొత్తూరు మండలంలోని కొత్తపేట ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ప్రథమ స్థానం సాధించిన సంతబొమ్మాళి ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.నీలిమకు రూ.2వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన సంతబొమ్మాళి ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.హిమబిందుకు రూ.1000 నగదు, తృతీయ స్థానంలో నిలిచిన ఎస్.యశ్వంత్‌రాజు(కొత్తపేట), కె.అభినయ్(సంతబొమ్మాళి), వి.యుగంధర్(సంతబొమ్మాళి) రూ.500 చొప్పున నగదు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌరసేవల్లో కనీస ప్రమాణాలు కరువు



సమావేశంలో మాట్లాడుతున్న స్వచ్ఛ సుందర శ్రీకాకుళ సాధన సమితి సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం మున్సిపాలిటీలో పౌరులకు అందజేస్తున్న సేవల్లో కనీస ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి జె.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రైతుబజార్ వద్ద విశ్రాంతి ఉద్యోగుల సమావేశ మందిరంలో స్వచ్ఛ సుందర శ్రీకాకుళ సాధన సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళ నగర పరిధిలో సేకరిస్తున్న చెత్త నుంచి సంపద తయారు చేసే కార్యక్రమం చేయడం లేదన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయకుండా తండ్యాంవలస వద్ద డంపింగ్ చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు నిత్యం సరఫరా చేస్తున్న మంచినీటిలో క్లోరిన్ కలపడం, పీహెచ్ ప్రమాణాలు తగు వ్యవధులలో పరీక్షలు జరపడం వంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. పట్టణంలో దోమల నివారణకు కనీస చర్యలు కూడా లేవన్నారు. కనీస ప్రమాణాలు పాటించక పోవడం వల్ల ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయన్నారు. అందుకే ప్రజలలో అవగాహన కల్పించడానికి స్వచ్ఛ సుందర శ్రీకాకుళ సాధన సమితి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, వంగా మహేష్, అర్జునరావు, చౌదరి లక్ష్మణరావు, ఉంగటి వెంకటరమణ, ప్రసన్న కుమార్, సుమతి, మోహన్, బీవీ రమణమూర్తి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నదీతీరాలు, శివాలయాల వద్ద బందోబస్తు

- పోలిపాడ్యమిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు
- ఎస్పీ వకుల్ జిందాల్



వకుల్ జిందాల్, ఎస్పీ, విజయనగరం

విజయనగరం క్రైమ్: కార్తీకమాసం చివరి రోజైన పోలిపాడ్యమి సందర్భంగా సోమవారం పెద్ద సంఖ్యలో భక్తులు నదులు, సముద్ర తీరాల్లో స్నానాలు ఆచరించే అవకాశమున్నందున ఎటువంటి ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఆదేశించారు. శివాలయాలు, నదీతీరాల్లో భక్తుల వస్తువులు దొంగతనానికి గురికాకుండా పెట్రోలింగ్ నిర్వహించే విధంగా పోలీస్ సిబ్బందిని నియమించాలని సూచించారు. చైన్‌స్నాచింగ్స్ జరగకుండా మఫ్టీలో పోలీసులు ఉండాలని పేర్కొన్నారు. పోలిపాడ్యమి సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, చైన్‌స్నాచింగ్స్ జరగకుండా భద్రతా ఏర్పాట్లను సంబంధిత సీఐలు, డీఎస్పీలు పర్యవేక్షించాలని ఎస్పీ జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టం చేశారు.

జీసీటీఏ జిల్లా నూతన కార్యవర్గం



బాధ్యతలు తీసుకున్న నూతన కార్యవర్గం

విజయనగరం అర్బన్: జిల్లా ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం నూతన కమిటీని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడిగా ఆర్.ఉమామహేశ్వరరావు, కార్యదర్శిగా డాక్టర్ జి.ఈరన్న, మహిళా కార్యదర్శిగా భావన, కోశాధికారిగా ఎల్.వెంకటరమణ ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు పరిశీలకుడిగా, డాక్టర్ బి.సహదేవుడు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. అనంతరం నూతన కమిటీ బాధ్యతలు చేపట్టింది. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్‌కేవలిఖాన్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మృతుడిది దోసరి గ్రామం

రాజాం సిటీ: స్థానిక శ్రీకాకుళం రోడ్డులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తిని మండల పరిధిలోని దోసరి గ్రామానికి చెందిన కురమాన పెంటయ్య(53)గా పోలీసులు ఆదివారం గుర్తించారు. సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పెంటయ్య ఎప్పటిలాగే రాజాంలో సెంట్రింగ్ పనిచేసి అనంతరం వర్షం కారణంగా ఇంటికి వెళ్లకుండా రాజాంలోనే ఉండిపోవాలనుకున్నాడు సంబంధిత పని ప్రదేశానికి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో పొందూరు వైపు వెళ్తున్న ఆటో ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన విషయం పాఠకులకు విదితమే. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు చేసి మృతునిది దోసరి గ్రామంగా గుర్తించారు. ఈ మేరకు మృతుడి భార్య చిన్నప్పమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సాగ్ పక్కాగా అమలుకావాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో కౌమార బాలికల పథకం (సాగ్)ను పక్కాగా అమలుచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఉదయం ఐటీడీఏ పీఓ, డీఎస్‌ఓ, ఐసీడీఎస్ పీఓ, సీడీపీఓలు, ఎంపీడీఓలు, సూపర్‌వైజర్లతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాగ్ అనేది 11 నుంచి 14 ఏళ్ల వయస్సు గల కౌమార బాలికలను లక్ష్యంగా చేసుకునే కేంద్ర ప్రాయోజిత పథకమని పేర్కొన్నారు. ఈ పథకం కింద కౌమార బాలికలకు పోషకాహారం అందించడంతో పాటు వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడం ప్రధాన లక్ష్యమన్నారు. కౌమార దశలో ఉన్న బాలికలకు నాణ్యమైన విద్యను అందించి, సాధికారత కల్పించడం ద్వారా స్వావలంబన, అవగాహన కలిగిన పౌరులుగా మారడానికి వీలు కల్పించాలనేది ఆలోచన అన్నారు. దీన్ని జిల్లాలో పక్కాగా అమలుచేయాలని సూచించారు. సమావేశంలో పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా సరఫరాల అధికారి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎం.ఎన్.రాణి, సీడీపీఓలు, ఎంపీడీఓలు, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు,రేపు రైల్వే గేటు మూసివేత

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వే గేట్ వద్ద ట్రాక్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో సోమవారం, మంగళవారం గేటు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గేటు మూసివేయనున్నామని పేర్కొన్నారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు గమనించాలని కోరుతూ గేటు వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దత్తిరాజేరు, చీపురుపల్లి, రాజాం వెళ్లే వాహనాలు గజపతినగరం నుంచి పోరలి మీదుగా, అలాగే షికారుగంజి జంక్షన్ నుంచి వెళ్లే వారు దత్తి గ్రామం మీదుగా వెళ్లాలని సూచించారు.

ఎంటీఎస్‌లకు బదిలీ..!

- వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరిట చర్యలు
- పాలకొండ డివిజన్‌లో నేడు కౌన్సెలింగ్

ఇదీ పరిస్థితి..

రాష్ట్రవ్యాప్తంగా ఇంతవరకు మండల స్థాయిలో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేసిన కూటమి ప్రభుత్వం నేడు డివిజనల్ స్థాయిలో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేసేందుకు నిర్ణయించింది. జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ డివిజన్లలో పార్వతీపురం డివిజన్‌లో ఇటువంటి సమస్యలు లేవు.అయితే పాలకొండ డివిజన్‌లో మాత్రం వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేయాల్సి ఉందని విద్యాశాఖ భావిస్తోంది. పాలకొండ డివిజన్‌లోని భామిని మండలంలో 8 ఎస్జీటీలు, సీతంపేట మండలంలో నాలుగు, గుమ్మలక్ష్మీపురం మండలంలో 12, కురుపాం మండలంలో 11 ఎస్జీటీలతో కలిపి 35 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఖాళీలను వీరఘట్టం, పాలకొండ, జియ్యమ్మవలస మండలాల్లో పనిచేస్తున్న 30 మంది 1998 బ్యాచ్ వారితో భర్తీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మిగిలిన పోస్టులను జూనియర్ ఎస్జీటీలతో భర్తీ చేయనున్నారు.



ఎంటీఎస్ పద్ధతిలో గతేడాది ఉద్యోగాలు పొందిన 1998 బ్యాచ్ డీఎస్సీ అభ్యర్థులు

వీరఘట్టం: 1998 డీఎస్సీలో అర్హులైన అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇవ్వాలని కోర్టులు తీర్పులు ఇచ్చినప్పటికీ 2014-19 మధ్య కాలంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోలేదు.2019 ఎన్నికలకు ముందు నిర్వహించిన ప్రజాసంకల్ప పాదయాత్రలో వారికి హామీ ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఇచ్చిన హామీకి కట్టుబడి 1998 డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు నిర్ణయించారు. ఈ మేరకు 2022 జూన్ 14న ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 1998 డీఎస్సీ ఉపాధ్యాయుల ఫైల్‌పై సంతకం చేసి వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 2023 ఏప్రిల్ 13న వారికి మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) కింద నెలకు రూ.32 వేలు వేతనం చెల్లిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో 739 మంది అభ్యర్థులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టింగ్‌లను వారి సొంత మండలాల్లోనే ఇచ్చింది. ప్రస్తుతం సొంత మండలాల్లో ఎంటీఎస్ పద్ధతిలో ఉద్యోగాలు చేస్తున్న 1998 బ్యాచ్ ఉపాధ్యాయులను వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరిట దూరప్రాంతాలకు బదిలీ చేసేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండడంపై ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం పాలకొండ డివిజన్‌లో పనిచేస్తున్న 30 మంది 1998 బ్యాచ్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి దూర ప్రాంతాలకు పంపించేందుకు ఏర్పాట్లు జరుతున్నాయి. వారిలో 90 శాతం మంది మరో 5 లేదా 6 ఏళ్లలో రిటైర్మెంట్ కానున్నారు.ఇప్పుడు వీరిని సొంత గ్రామాల నుంచి 60 నుంచి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాలకు బదిలీ చేస్తే కుటుంబాలతో ఉన్న తాము ఏవిదంగా వెళ్లగలమని వారంతా మధన పడుతున్నారు.

ఇదీ విషయం..

పాలకొండ డివిజన్‌లో 1998 బ్యాచ్‌కు చెందిన ఎంటీఎస్ ఉపాధ్యాయులు జియ్యమ్మవలస మండలంలో 14 మంది, పాలకొండ మండలంలో 10, వీరఘట్టం మండలంలో 9 మందితో కలిపి 33 మంది ఉన్నారు. వారిలో వీరఘట్టం మండలంలో ఉన్న ముగ్గురిని వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌పై స్థానికంగా ఉన్న పాఠశాలలో అడ్జెస్ట్ చేశారు.దీంతో పాలకొండ డివిజన్‌లో సొంత మండలాలతో పాటు సొంత గ్రామాల్లో పనిచేస్తున్న ఈ 30 మందిని వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌పై గుమ్మలక్ష్మీపురం, కురుపాం, భామిని, సీతంపేట మండలాల్లోని కొండ ప్రాంతాలకు పంపించేందుకు సోమవారం కౌన్సెలింగ్ చేయనున్నారంటూ వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే కౌన్సెలింగ్

ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే ఎంటీఎస్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రక్రియ ఇది.ప్రస్తుతం పార్వతీపురం డివిజన్‌లో ఎటువంటి ఇబ్బందులు లేవు.సోమవారం పాలకొండ డివిజన్‌లో పనిచేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నాం.

ఎస్.తిరుపతినాయుడు, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

సొంత మండలాల్లోనే పోస్టింగ్స్ ఇస్తామని జీఓ ఇచ్చారు



1998 బ్యాచ్ వారికి సొంత మండలాల్లోనే పోస్టింగ్స్ ఇస్తామని గత ప్రభుత్వం జీఓ ఇచ్చింది. ఎందుకంటే మాలో అందరూ 54 ఏళ్ల నుంచి 57 ఏళ్ల మధ్యవారే ఎక్కువ మంది ఉన్నారు. మరో 5 నుంచి 6 ఏళ్లలో రిటైర్మెంట్ అవుతాము. ఈ నేపథ్యంలో మమ్మల్ని దూరప్రాంతాలకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరిట బదిలీ చేయాలనుకోవడం దారుణం. వచ్చే అరకొర జీతాలతో కుటుంబాలను పోషించుకోవడమే ఇబ్బందిగా ఉంది.ఈ పరిస్థితుల్లో దూరప్రాంతాలకు వెళ్లడం చాలా ఇబ్బందితో కూడుకున్న పని. ప్రభుత్వం పునరాలోచన చేసి మమ్మల్ని సొంత మండలాల్లోనే ఉంచాలి. – వారణాసి నర్సింగరావు, ఎంటీఎస్ ఉపాధ్యాయుడు, వీరఘట్టం

ఇది చాలా అన్యాయం



మేము రిటైర్మెంట్ అయ్యేంత వరకు సొంత మండలాల్లోనే పోస్టింగ్స్ ఇస్తున్నట్లు గత ప్రభుత్వం జీఓ ఇచ్చింది. ఆ జీవోను కాలరాస్తూ నేడు మమ్మల్ని దూరప్రాంతాలకు బదిలీ చేయాలనుకోవడం చాలా అన్యాయం. మాకు వచ్చే అరకొర జీతాలతో ఎలా బతికేది. మరో 5 ఏళ్లలో రిటైర్ కానున్న మమల్ని ఇబ్బందులు పెట్టడం సరికాదు. జిల్లా విద్యాశాఖ అధికారులు మా పరిస్థితిని గుర్తించాలి.

– పసుపురెడ్డి మురళి, ఎంటీఎస్,ఉపాధ్యాయుడు, వీరఘట్టం

పీటీ పేరుతో బోధన సమయం వృథా



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్‌రావు

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్‌రావు

విజయనగరం అర్బన్: మెగా పేరెంట్ టీచర్స్ (పీటీ) సమావేశం పేరుతో ఈ నెల 7వ తేదీన ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించనున్న కార్యక్రమం సందర్భంగా బోధన సమయాన్ని వృథా చేయవద్దని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్‌రావు కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా ఆఫీస్ బేరర్‌ల సమావేశంలో పేర్కొన్నారు. ప్రతిరోజూ అధికారులు సమావేశాలు పెట్టి ఉపాధ్యాయులు బడిలో పాఠాలు చెప్పేలా కాకుండా తల్లిదండ్రుల సమావేశం నిర్వహణ కోసం వివిధ కమిటీలు వేయడం ఆ కమిటీలను యాప్‌లలో అప్‌లోడ్ చేయడం వంటి వాటికి సమయాన్ని కేటాయించడం వల్ల బోధన సమయాన్ని కోల్పోతున్నామని వివరించారు. యాప్‌లలో అప్‌లోడ్ చేయడం వంటి విధుల నుంచి దూరం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కేఈశ్వరరావు మాట్లాడుతూ రానున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల్లో అర్హులైన ఉపాధ్యాయులను ఓటర్లుగా నమోదు చేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు, సహాధ్యక్షుడు వి.ప్రసన్నకుమార్, కోశాధికారి సీహెచ్‌భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.ప్రసాదరావు, సీహెచ్‌తిరుపతినాయుడు, జి.రాజారావు, ఎన్.సత్యనారాయణ, వీవీరాధాభవాని, కె.శ్రీదేవి, శంకరరావు, ఎం.రఘునాథరాజు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.రాంప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఆరికతోట విద్యార్థి



రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో సాధించిన కప్, పతకాలతో జ్యోతిప్రకాష్

రామభద్రపురం: అనంతపురంలో గత నెల 23,24,25 తేదీలలో జరిగిన స్కూల్‌గేమ్స్ అండర్ 17 విభాగం రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో రామభద్రపురం మండలంలోని ఆరికతోట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. అండర్ 17 బాలుర విభాగంలో 10వ తరగతి చదువుతున్న ఎం.జ్యోతిప్రకాష్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో ప్రథమస్థానం సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు వి. అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రకాష్‌ను పాఠశాల హెచ్‌ఎం జీసీహెచ్‌ఎస్ శర్మ, ఉపాధ్యాయుడు రామారావు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల అసమానతలు తొలగాలి



ఆర్టీసీ కాంప్లెక్స్ కుదలి వద్ద మాట్లాడుతున్న జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదరరావు

- జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదరరావు

పార్వతీపురంటౌన్: ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల సమాజంలో ఉండే అసమానతలు తొలగాలని పార్వతీపురం మన్యం జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదరరావు పేర్కొన్నారు. ఎయిడ్స్ మహమ్మారిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని జిల్లా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, ఎయిడ్స్ బారిన పడిన వ్యక్తులకు సహాయక వాతావరణాన్ని పెంపొందించాలని సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినం సందర్భంగా ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ర్యాలీ కలెక్టరేట్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ మీదుగా మళ్లీ కలెక్టరేట్ వరకు కొనసాగింది. ర్యాలీలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డా.ఎం.వినోద్ కుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్‌మోహన్‌రావు, ఇతర వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ఎన్‌ఎస్‌ఎస్, ఆర్‌ఆర్‌సీ వలంటీర్లు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

8న ఆన్‌లైన్ క్రీడా జ్ఞాన పరీక్ష

- జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వర రావు

పార్వతీపురంటౌన్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, శాప్, క్రీడా భారతి సంస్థలు సంయుక్తంగా ఈ నెల 8వ తేదీన 4వ క్రీడాజ్ఞాన పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వ రరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

పరీక్షను హెచ్‌టీటీపీ:// క్రీడా భారతి.ఓఆర్‌జీ లింక్ నందు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు, అవార్డ్స్ అందజేయనున్నట్లు తెలిపారు. ప్రథమ విజేతకు రూ. 1 లక్ష చొప్పున ఒకరికి, ద్వితీయ అవార్డు రూ. 50వేలు చొప్పున ఇద్దరికి, తృతీయ అవార్డు రూ. 25 వేలు చొప్పున ఆరుగురికి, నాల్గవ అవార్డు రూ.11 వేలు చొప్పున 11 మందికి నగదు బహుమతి ఇవ్వనున్నట్లు వివరించారు. 4వ క్రీడా జ్ఞాన పరీక్ష డిసెంబర్ 8న ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ లాగిన్‌లో ఉంటుందన్నారు. 50 మార్కులకు 25 నిమిషాల పాటు పరీక్ష జరుగుతుందని, 12 ఏళ్ల నుంచి ఆ పైబడిన వయస్సు గల వారందరూ పరీక్షకు హాజరుకావచ్చని చెప్పారు. ఆసక్తి గల జిల్లాలోని క్రీడాకారులు, విద్యార్థులు, పౌరులు 8న జరగనున్న ఆన్‌లైన్ క్రీడా జ్ఞాన పరీక్షకు రిజిస్టర్ కావాలని ప్రకటనలో కోరారు.

గిరి పుత్రులకు ద్రోహం చేయవద్దు

- సీపీఎం విజ్ఞప్తి



గిరిజన యూనివర్సిటీ జిల్లాలో కొనసాగించాలంటూ పోస్టర్లు విడుదల చేసిన సీపీఎం, గిరిజన సంఘాల నాయకులు

పాలకొండ రూరల్: పార్వతీపురం మన్యం జిల్లా మెంటాడ మండలం కుంటినవలస వద్దనే గిరిజన యూనివర్సిటీని కొనసాగించాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం పాలకొండ మండలంలోని మల్లమ్మగూడ వద్ద మండల గిరిజన నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభజన చట్టం ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లాకు కేటాయించిన కేంద్రియ గిరిజన యూనివర్సిటీని తరలించే యత్నం కూటమి ప్రభుత్వం మానుకోవాలని హితవుపలికారు. గత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మెంటాడ మండలంలో 560 ఎకరాలు పరిశీలించి, పనులకు శంకుస్థాపన చేపట్టిందని, పనులు జరుగుతున్న క్రమంలో తాజాగా అధికారం చేపట్టిన కూటమి నాయకులు, విద్యాశాఖ మంత్రి లోకేష్ 2019లో టీడీపీ హయాంలో విజయనరం జిల్లా కొత్తవలస మండలం రెల్లి వద్ద ప్రతిపాదించిన విషయం గుర్తు చేయడం, అక్కడే పనులు కొనసాగిస్తామనడం అర్థంలేని విషయమని అసహనం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో మంత్రి లోకేష్ చేసిన ఈ వాఖ్యలను వెనక్కి తీసుకోకుంటే ఈ ప్రాంత గిరిజనులకు ద్రోహం చేసినట్లేనన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న యూనివర్సిటీని పూర్తి చేస్తే ఈ ప్రాంత గిరిజనులకు, సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి దోహద పడుతుందని సీపీఎం నాయకుడు ఎ.భానుచందర్ అన్నారు. ఈ నిర్మాణాలకు రూ.1100కోట్లు అవసరమని, కేవలం 432 కోట్లు మాత్రమే కేంద్రం విడుదల చేసిన విషయం గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం తక్షణమే తమ నిర్ణయం ఉపసంహరించుకుని యథాతథంగా మెంటాడ మండలంలో నిర్మాణాలు పూర్తిచేయాలని కోరారు. లేకుంటే జిల్లా పరిధిలో మేధావులు, గిరిజన సంఘాలతోపాటు అన్నివర్గాల వారిని కలుపుకుని పోరాటాలనికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లు ఈ సందర్భంగా విడుదల చేశారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు డి.దుర్గారావు, కాద రాము, ఎస్.మజ్జి, యూవీ.చంప, గబ్రిల్ రమేష్, రాజేష్ జోషి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో శాస్త్రీయ దృష్టి పెరగాలి

- జనవిజ్ఞాన వేదిక మహాసభ పిలుపు

విజయనగరం అర్బన్: ప్రజలకు ఎదురవుతున్న అనేక సమస్యలు వారి పరిధిలోనే పరిష్కారం కావాలంటే వారిలో శాస్త్రీయ దృష్టి పెరగాలని ఆ దిశగా చైతన్యం రావాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ సిబ్బంది సమావేశ భవనంలో ఆదివారం జరిగిన వార్షిక మహాసభలో పలుపురు పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక ఉపాధ్యక్షుడు పి.సత్యంనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై సభ్యులు చర్చించి తీర్మానాలు చేశారు. గడిచిన ఏడాది వేదిక నిర్వహించిన కార్యక్రమాలను సమీక్షించి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. విద్య, ఆరోగ్యం, పర్యావరణ తదితర రంగాల్లో కేంద్రీకరించి పనిచేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం గత ఏడాది కాలంలో క్రియాశీలకంగా పనిచేసిన పలువురికి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రమణప్రభాత్, వేదిక సమతా విభాగం జిల్లా కన్వీనర్ జి.నిర్మల, జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు జె.నీలయ్య, సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి చీకటి దివాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజగోపాల్, పట్టణ వేదిక అధ్యక్ష కార్యదర్శులు కె.శశిధర్, డాక్టర్ ఎల్.చిన్నారి తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాపిక అందుకుంటున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

ప్రమాదం జరిగిన తీరుపై విచారణ



ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణిబాబు తదితరులు

భోగాపురం: గత నెల 30వ తేదీన శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఫార్చునర్ కారు పోలిపల్లి జాతీయ రహదారి వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీకొట్టి అవతలి లైన్‌లో విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వస్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాకుళానికి చెందిన నలుగురు వ్యక్తులు మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రమాదం ఏవిధంగా జరిగిందనే అంశాంపై డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణిబాబు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దుర్గారావులు ఆదివారం విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా ముందుగా ప్రమాదం జరిగిన ప్రదేశం వద్దకు వెళ్లి నేషనల్ హైవే రోడ్డును, ప్రమాదానికి గురైన కారును పరిశీలించారు. ప్రమాదం ఏవిధంగా జరిగింది, హైవే రోడ్డు నిర్మాణంలో ఏమైనా లోపాలు ఉన్నాయా? డ్రైవర్ కారును నిర్లక్ష్యంగా నడపడం వల్ల ప్రమాదం జరిగిందా? లేదా వెహికల్‌లో ఏమైనా లోపాలు ఉన్నాయా? అనే అంశాలపై విచారణ చేపట్టారు. ఈ విచారణలో వారివెంట నేషనల్ హైవే అథారిటీ ఇంజినీర్ మల్లికార్జునరావు, సీఐ ఎన్వీ ప్రభాకర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రాజేటి కృష్ణవేణి

గజపతినగరం: మండలంలోని గుడివాడ గ్రామం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ మహిళ ఆదివారం మృతి చెందింది. ఈ సంఘటనపై స్థానిక ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలంలోని పెదమానాపురం గ్రామానికి చెందిన రాజేటి కృష్ణవేణి(78) విశాఖపట్నంలో ఉంటున్న సోదరి ఇంటికి ఎప్పటికప్పుడు వెళ్లి వస్తుంటుంది. అదేవిధంగా గత నెల 30వ తేదీన పింఛన్ డబ్బులు అందుకుని మానాపురం నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి తన ఇంటికి కానీ, సోదరి ఇంటికి చేరుకోకపోవడంతో గ్రామస్తులు వెతకడం మొదలు పెట్టారు. గుడివాడ గ్రామంలోని ఓలమ్ కంపెనీ సమీపంలో ఓ మహిళ జాతీయ రహదారిపై గాయాలతో పడిఉందని పోలీసులకు సమాచారం అందంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో పెదమానాపురం గ్రామానికి చెందిన రాజేటి కృష్ణవేణి మృతి చెందినట్లు గుర్తించారు. మృతురాలి భర్త జోగారావు ఇదివరకే చనిపోయారు. ఆమెకు పిల్లలు లేరు. ఒంటరిగానే ఉంటోంది. ఆమె మేనల్లుడు ఎమ్.రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపారు.

తూర్పుకాపు సంఘం అభివృద్ధికి కృషి



వేదికపై మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ

- సామాజికవర్గం ఆత్మీయసమావేశంలో పలువురు నేతలు

విజయనగరం పూల్‌బాగ్: తూర్పుకాపు సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ, మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక కామాక్షినగర్‌లో తూర్పుకాపు సామాజిక వేదిక ఆధ్వర్యంలో తూర్పుకాపు ఆత్మీయకలయిక కార్యక్రమం ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలేమైనా సరే పదేళ్లుగా ఒకే వేదిక పైకి అందరినీ తీసుకురావడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమాల ఏర్పాటుకు సంఘం నాయకులు చేస్తున్న సహాయసహకారాలు, కృషి హర్షించదగ్గ విషయమని ప్రశంసించారు. ఎప్పుడు ఎవరికి ఏవిధమైన సహాయసహకారాలు కావాలన్నా తమను సంప్రదించవచ్చని హామీ ఇచ్చారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మాజీ మంత్రి నారాయణస్వామినాయుడు, తూర్పుకాపుకార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అంబళ్ల అప్పలనాయుడు, ప్రధానకార్యదర్శి ఆర్లె కృష్ణారావు, ట్రెజరర్ పత్తిగిల్లి రామారావు, మాజీ అధ్యక్షుడు రొంగలి రామారావు, సూర్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మజ్జి అప్పారావు, రాష్ట్ర కార్యదర్శి మంత్రి రమణమూర్తి, ముదిలి నాగభూషణం,సైలాడ ఈశ్వరరావు, నడిపల్లి ఆదినారాయణ, బెవర వెంకటరావు, పువ్వల శ్రీను తదితరులు పాల్గొన్నారు.